# మనిషి మృగం



పెద్ద పోస్టాఫీసులో పది కార్డులు, నాలుగు కవర్లు కొనుక్కుని బయటికి వచ్చాడు రాజారావు! పోస్టాఫీసు మెట్లమీద కూర్చుని... పోలిథిన్ కవర్లలో కోవాబిళ్లలు, చేగోడీలు అమ్మే కుఱ్ఱాడు రాజారావుని చూసి "తీసుకోండి సార్ - పెద్దాపురం తయారీ ! మంచిగుంటయి!" అంటూ వెంట పడ్డాడు... వద్దంటున్నా వాడు వినడం లేదు. మెట్లకు రెండు వైపులా తపాలా పెట్టెలు... ఆ పెట్టెలకు అటూ ఇటూ ముందూ వెనుకా అన్నట్టుగా సైకిళ్లు, స్కూటర్లు దారికడ్డంగా నిలబెట్టి ఉండటంతో ఆ కుఱ్ఱాణ్ణి తప్పించుకోవడం... రాజారావు వల్ల కాకపోయింది. అదీగాక వాడి చేతిలోని కోవాబిళ్లలు చూడగానే అవంటే ఎగిరి గెంతేసే 'వంశీ' మనసులో మెదిలి... ఒక పేకెట్టు తీసుకుని కుఱ్ఱాడికి డబ్బులిచ్చి గబగబా ముందుకు నడిచాడు.

"బాబూ!"

ఉలిక్కిపడినట్లయి వెనక్కి తిరిగి చూశాడు రాజారావు...!

ఎవరో అరవై ఏళ్ల ముసలావిడ ! ముఖం నిండుగా ఉంది... ముదురు నీలం నేత చీర కట్టుకుంది... నుదుట పావలాకాసంత బొట్టు పెట్టుకుంది. భుజం చుట్టూ కొంగు కప్పుకున్నా

చీరెకున్న చిరుగు స్పష్టంగా కనబడుతోంది.

"నీకు పుణ్యం ఉంటుంది నాయనా! కాసింత ఈ ఉత్తరం ముక్క రాసిపెట్టవూ...? అడుగో ! ఆ బాబునడిగితే అర్ధరూపాయి డబ్బులిమ్మంటున్నాడు... నా దగ్గర అర్ధరూపాయి డబ్బులు ఎక్కడ ఉన్నాయి తండ్రీ...?" ఆమె దీనంగా అభ్యర్ధనగా అడిగింది. ఆమె మాటలు స్వచ్ఛంగా ఉన్నాయి... గొంతు స్ఫుటంగా, ఉంది.

రాజారావు అటువైపుగా చూశాడు... అక్కడ తపాలపెట్టె దగ్గర బాసింపటం వేసుకుని అందరికీ ఉత్తరాలు రాసి పెడుతూన్న 'రాతగాడు' రద్దీగా ఉన్నాడు. అతనికి ఏ ఉద్యోగం దొరక్క... ఈ రాతపని చేపట్టినట్టున్నాడు. మనిషి పొట్టిగా ఎర్రగా దుబ్బులా ఉంటాడు. పొద్దుట ఏడుగంటలకే పోస్టాఫీసు మెట్లమీద తయారవుతాడు... కార్డు రాయటానికి అర్ధ రూపాయి, మనియార్డరు, టెలిగ్రాం ఫారాలు నింపటానికి రెండు రూపాయలు మనిషిని బట్టి వసూలు చేస్తుంటాడు. అతనికి పేదా ధనిక భేదం లేదు... ఈ ముసలావిడ ప్రాధేయ పడినంత మాత్రాన అతను ఉత్తరం ఉదారంగా రాస్తాడా...?

"రండి ! మామ్మగారూ ! అలా వరండాలోకి వెళ్దాం !" రాజారావు వెనక్కి మళ్లాడు.

"మా నాయనే ! మా బాబే !" అంటూ ముసలావిడ ముఖం ఇంత చేసుకుని రాజారావుని అనుసరించింది...

రాజారావు వరండాలో బెంచీమీద కూర్చున్నాడు. ముసలావిడ తన చేతిలోని కార్డుని రాజారావు చేతిలో పెట్టింది.

"చెప్పమ్మా ! అడ్రసు ఏం రాయాలి...?" రాజారావు అడిగాడు.

"ఉత్తరం అల్లుడి పేరుమీదే రాయి బాబు... అమలాపురం, ముళ్ల కంచెల బాబూరావు, మునిసిపాలిటీ మేస్త్రీ... వెంకటేశ్వరుడి గుడివీధి.. అంటే వెళ్ళిపోతుంది నాయనా !" ముసలమ్మ వరండా గచ్చుమీద చతికిలపడినట్టుగా కూర్చుంది.

"అల్లుడి పేరు మీద రాసినా ఉత్తరం అమ్మాయి చేతిలోనే పడుతుంది బాబూ ! అతగాడు డ్యూటీకెళ్ళిపోతాడులెండి !"

విషయం చెప్పమన్నట్టుగా ముసలమ్మ ముఖంలోకి చూశాడు రాజారావు...!

"నా పేరు సీతమ్మ బాబూ !" ముసలమ్మ ఒక క్షణం ఆగింది... విషయం మనసులో కూడ బలుక్కుంటూ చెప్పసాగింది. ఆమె చెప్పిన విషయాన్ని ఆవిడ మాటల్లోనే కార్డుమీద రాశాడు రాజారావు ! రాసి ఆమెకు చదివి వినిపించాడు.

"అల్లుడుగార్ని, అమ్మాయినీ చిరాయువుగా దీవించి సీతమ్మ రాయునది... పిల్లలూ మీరు కులాసాగా ఉన్నారని భావిస్తున్నాను... అమ్మా ! నా బంగారు తల్లీ ! (కూతురు పేరు బంగారుతల్లేనట! ముసలమ్మ మాటల్లో చెప్పింది) నా ఆరోగ్యం బాగానే ఉంది... మీ నాన్నగారికే ఏమీ బావుండలేదు. మూడు రోజుల నుంచి మూసిన కన్ను తెరవడంలేదు. ఒకటే మూలుగు... మందుల దుకాణంలో మాత్రలు తెచ్చి వేశాను. జావకాచి పట్టాను. జ్వరం ఈ పూట కాస్త తగ్గిందనుకో... ఎందుకోనమ్మా !... నిద్రలో కూడా నీ పేరే కలవరిస్తున్నారు మీ నాన్నగారు...! ఒక్కసారి వచ్చి చూసి వెళ్లవూ...? మాకున్న బంగారు తల్లివి నువ్వే కదమ్మా ! ఆశీర్వచనాలతో... సీతమ్మ!'

ఉత్తరం సీతమ్మ చేతిలో పెట్టాడు రాజారావు....ఆవిడ రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టింది.

"బాబూ ! ఉత్తరం రాసినా నా బంగారు తల్లి రాదు... అది వద్దామనుకున్నా అల్లుడు రానీయడు నాయనా! ముళ్లకంచెలవారి వంశంలోంచి వచ్చాడు కదా ! కానీ కన్న పేగు... ఆశ చావదు తండ్రీ... తను రాలేకపోయినా, అతగాడి కళ్లుకప్పి ఓ యాభైరూపాయలు మనియార్డరు పంపిస్తుంది... అందుకే ఈ తాపత్రయం తండ్రీ !"

సీతమ్మ మాటలకు మౌనంగా తలపంకించాడు రాజారావు.

అప్పటికే అతని మనసు ఆర్ద్రమయింది. అడగాలనుకున్న ప్రశ్న గొంతులోనే ఆగిపోయింది...? ఆలోచన ఆమె చుట్టూ పరిభ్రమించింది.

సీతమ్మ తన భర్త జ్వరంతో మంచం మీద మూలుగుతున్నాడని చెప్పినప్పుడు, ఆవిడ ముఖం నిండా విషాదపు నీలినీడలెన్నో అలుముకున్నాయి... కళ్లల్లో కన్నీటి ప్రవాహాలు సుళ్ళు తిరిగాయి... బ్రతుకు భయం, బాధల ప్రతిధ్వనులకేమో ఆమె గొంతు వణికింది... ఆ వృద్ధ మాతృమూర్తి మాటల్లోని నిజాయితీ, నిస్సహాయత, లేమితనం రాజారావును కదిలించాయి...!

"నీకు కొడుకులు లేరామ్మా !" రాజారావు జాలిగా అడిగాడు.

సీతమ్మ ఒకక్షణం విస్మయంగా చూసింది. ఆమె శరీరం వజవజా వణికింది. చల్లగాలికి నల్లటి మేఘం కరిగి నీరయినట్లు ఆమె కళ్ల నుండి రెండు కన్నీటి బొట్లు బొటబొటా రాలాయి... దు:ఖం పొంగి పొరలి వచ్చింది.

'చేతికందొచ్చిన కొడుకే... మాయదారి రోగమొచ్చి... మాయం అయిపోయాడు కొడుకా ! ఆ కొడుకే బతికుంటే నాకీ తిప్పలెందుకు నాయనా!' సీతమ్మ కొంగుతో కళ్ళొత్తుకుని భారంగా పైకి లేచింది.

కూతురుకి రాయించిన ఉత్తరం పోస్టు డబ్బాలో వేసింది.

"వెళ్లొస్తాను బాబూ ! పిల్లా పాపలతో సుఖంగా ఉండు...!" రెండు చేతులెత్తి ఆమె రాజారావును ఆశీర్వదిస్తూ రెండడుగులు వేసింది !

"సీతమ్మగారూ ! మీరేమీ అనుకోకపోతే నాదోమాట" రాజారావు పిలుపుతో ఆవిడ వెనక్కి తిరిగింది.

"బాబాయిగారికి ఒంట్లో బాగులేదంటున్నారు... నేనూ మీ కొడుకులాంటి వాడినే... ఈ పదిరూపాయలూ..." జేబులోంచి పది రూపాయలు నోటు తీశాడు. రాజారావు !

"బాబూ !" సీతమ్మ క్షణకాలం విస్ఫారిత నేత్రాలతో చూసింది. ఆ గొంతులో అభిమానం ఉంది... ఆవేదన ఉంది... ఆత్మీయత ఉంది...!

"ఉత్తరం రాసి పెట్టడమే నువ్వు నాకు చేసి పెట్టిన పెద్ద సాయం... వద్దుబాబూ ! కొవ్వొత్తుల కంపెనీలో రోజుకూలీకి పనిచేస్తుంటాను. ఒంట్లో బాగుంటే మీ బాబాయిగారు కూడా పన్లోకి వస్తారు నాయనా ! ఈ పూట పనిలోకి వెళ్లలేదు, ఫరవాలేదు... ప్రాణం ఉన్నంత కాలం బతకాలిగా ! ఓపిక ఉన్నంతకాలం బతుకు బండిని ఎలాగోలా లాగాలిగా ! తప్పదు... వస్తాను... బాబూ ! మంచంమీద ఆయన ఎలా ఉన్నారో... ఏంవిటో" సీతమ్మ నెమ్మదిగా ఒంగి నడుస్తూ వరండాలోంచి వెళ్లిపోయింది. రాజారావు కొద్ది నిముషాలు ఆలోచిస్తూ అలాగే బెంచీమీద కూర్చుండిపోయాడు. 'వికసించిన విద్యుత్తేజం' ఏదో సీతమ్మ రూపంలో కదలి కనుమరుగయినట్లుగా అనిపించింది. ఈ వయసులో కూడా కష్టపడుతూ, ఒకరికొకళ్లుగా బ్రతుకీడుస్తున్న ఆవృద్ధ దంపతుల్ని తలచుకుంటే హృదయం బరువెక్కినట్లయింది...

రాజారావుకు తన తల్లి రూపం గుర్తులేదు... ఊహ తెలిసిన తరువాత ఆమె ఫోటో కూడా ఎక్కడా మిగల్లేదు... తండ్రి వ్యసనాల ఊబిలో కూరుకుపోయి రోగంతో మంచానపడి... అతను ఆదుకునే అవకాశం ఇవ్వకుండానే వెళ్ళిపోయాడు. వాళ్లను తలచుకుంటే ఒక బాధాశకలం బాణంలా గుచ్చుకుంటుంది...!

రాజారావు పోస్టాఫీసు ఆవరణలోంచి బయటకొచ్చాడు... రోడ్డు మీద అటూ ఇటూ చూశాడు. సీతమ్మ ఎక్కడా కనిపించలేదు.

ఎదురుగా 'తిరుమల'థియేటరులో ఉదయపు ఆట ఏదో ఇంగ్లీషు పిక్చరు కాబోలు కుర్రకారు టిక్కెట్ల కోసం ఎగబడుతున్నారు... మధ్యాహ్నపు ఆటగా "ఓతల్లికథ" ప్రదర్శిస్తున్నారు... రాజారావుకు మూడు నెలలుగా ఆ సినిమా చూడాలన్న కోరిక మనసులో బలీయంగా ఉంది. అతని శ్రీమతి పిల్లలూ మొదటివారంలోనే ఆ చిత్రం చూశారు...

ఈ రోజు డ్యూటీకి సెలవేకదా ! పోనీ చూద్దామా అనిపించింది. తిన్నగా ఇంటికి నడిచాడు రాజారావు. కోవాబిళ్ళల పేకెట్టు 'వంశీ' చేతిలో పెట్టాడు వాడు 'థాంక్యూ ! డాడీ' అంటూ చిరంజీవి ఫోజులో ఎగిరి మెడ పట్టుకున్నాడు. వాడ్ని వదిలించుకుని లోపలికి వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కునాడు... అతని శ్రీమతి అప్పటికే అన్నీ టేబుల్ మీద వడ్డించింది. ఇంటి ఓనరు 'కువాయిట్' వెళ్ళి రావడం గురించి, రూపాయలు ఖర్చుపెట్టి అమ్మ ప్రేమని, వాత్సల్యాన్ని వ్యాపార విలువలతో మిళాయించి, ఇద్దరు హీరోలు, ముగ్గురు హీరోయిన్లతో విదేశాల్లో భారీగా నిర్మించిన చిత్రమిది... ఇప్పటికే అయిదు కోట్ల రూపాయలు వసూలు చేసిందట ! కన్న తల్లి సెంటిమెంటు నిర్మాతకు కనకవర్షం కురుపిస్తోంది.

చుట్టూ ఉన్న జనాన్ని పరికిస్తోన్న రాజారావు అదిరిపడ్డాడు !



ఆవిడ సంపాదన గురించి భార్య ఏవో కబుర్లు చెబుతూంటే రాజారావు భోజనం పూర్తి చేశాడు... పత్రిక తీసుకుని మంచం మీద వాలాడు. ఎందుకో ఏకాగ్రత కుదరలేదు... మనసు అస్థిమితంగా ఉంది... మంచం మీద అటూ ఇటూ దొర్లాడు... కళ్ళు మూసుకున్నాడు. నిద్రపట్టలేదు. లేచి ముఖం కడుక్కుని ఒకటిన్నర గంటలకే తయారయి 'మ్యాట్నీకి వెళుతున్నానని భార్యతో చెప్పి బయటపడ్డాడు !

థియేటరు వద్దకు వెళ్లేసరికి ఆవరణంతా రద్దీగా ఉంది. నేల క్లాసు ముందు మరింత గోలగా ఉంది. మూడు నాలుగు క్యూలు ఉన్నాయి. ఒక క్యూలో నిలబడ్డాడు రాజారావు ! క్యూనెమ్మదిగా కదులుతోంది.

కోట్లు గడించిన ఓ భారీ నిర్మాత రెండు కోట్ల

మనసులో అలజడి... అల్లకల్లోలం ! అక్కడ అవతల క్యూ దగ్గర ఒక స్త్రీ చేయిసాచి అడుక్కుంటోంది. ఆమె సీతమ్మ !

పొద్దుట పోస్టాఫీసు వద్ద తనతో కూతురికి ఉత్తరం రాయించుకున్న సీతమ్మ ! పది రూపాయలు ఇవ్వబోతే వద్దంటూ తిరస్కరించి ఎంతో అభిమానాన్ని ప్రదర్శించిన స్త్రీమూర్తి ! ఒక జీవితకాలపు సంయమనాన్ని, సహనాన్ని తన మాటల్లో ధ్వనించిన మాతృమూర్తి !

ఎందుకిలా అడుక్కుంటోంది...? ఏమిటీ వైవిధ్యం...? ఏమిటీ వైరుధ్యం...? అడుక్కోవడం ఆమె వృత్తా...? తనతో అబద్ధం చెప్పిందా...? ఆమెకెవరూ లేరా...?

రాజారావు ఆలోచించలేకపోతున్నాడు !

సీతమ్మ ఒక్కొక్కరి దగ్గరా ఏవో మాటలు

చెబుతూ దీనంగా యాచిస్తోంది. రాజారావు ఆమెవైపు చూడలేక తల తిప్పుకున్నాడు...!

తను కనిపిస్తే ఆమె పరిస్థితి ఎలా ఉంటుంది...? ముఖం చాటు చేసుకుంటుందా...? సిగ్గుతో ముడుచుకుపోతుందా...? ఏడుస్తూ పారిపోతుందా...? ఏమైనా తను సీతమ్మకు కనిపించకూడదు.

రాజారావు కౌంటరు వద్దకు వచ్చేశాడు. గబగబా టిక్కెట్టు తీసుకున్నాడు. జనాన్ని తప్పించుకుంటూ సీతమ్మకు కనిపించకుండా రిజర్వుడు క్లాసువైపు అడుగులు వేస్తున్నాడు...

జనంలో ఉన్నట్టుండి చిన్న కలకలం... గోల... గొడవ... కేకలు ! క్యూ చెదిరిపోయింది... జనం ఒకళ్ల మీద ఒకళ్లు పడిపోతున్నారు. రాజారావు ఆ దిశగా చూశాడు. అక్కడ ఒక యువకుడు సీతమ్మ జుట్టు పట్టుకుని లాగుతూ చెంపమీద టపాటపా కొడుతున్నాడు... తిడుతున్నాడు... సీతమ్మ ఆ యువకుడి దెబ్బల్ని నిశ్శబ్దంగా భరిస్తోంది ! చుట్టూ జనం చోద్యం చూస్తున్నారు...!

రాజారావు ఒక్క ఉదుటున సీతమ్మ వద్దకు పరుగెత్తాడు !

"ఆగండి ! ఏం జరిగింది...? ఆవిడ్ని ఎందుకలా కొడుతున్నారు...?

రాజారావు ఆవేశంగా అడిగాడు... ఆ యువకుడు సీతమ్మ జుట్టు వదిలేశాడు.

'నా జేబులో చేయి పెట్టి పర్సు కొట్టేసిందండీ! సమయానికి చూసుకోబట్టి సరిపోయింది గానీ...!' యువకుడు కోపంతో ఊగిపోతున్నాడు. ముప్పై ఏళ్లవయస్సు ఉండొచ్చు... మనిషిపొడుగ్గా శుభ్రంగా ఉన్నాడు. తెల్లటి పొట్టిచేతుల షర్టు నల్లటి ఫేంటులో ఇన్‌షర్టు చేసుకున్నాడు... కళ్లకు చలువ కళ్ళద్దాల జోడు పెట్టుకున్నాడు.

సీతమ్మ దొంగతనం చేసింది...! అతని జేబులో పర్సు కొట్టేసింది...!

రాజారావు సీతమ్మవైపు సానుభూతిగా చూశాడు. ఆమె అతడ్ని చూసి భూమిలోకి కూరుకుపోయినట్టుగా ఏడుస్తోంది.

"ఏమ్మా ! ఇది నిజమా...?" రాజారావు సూటిగా అడిగాడు. మరోసారి రెట్టించి అడిగాడు. సీతమ్మ మాట్లాడలేదు. దోషిలా కొంగు నోట్లో దోపుకుని, దు:ఖంతో వెక్కివెక్కి పడుతోంది.

"ఆ ఏడుపు చూడండి ! అంతా నటన ఈ మధ్య ఆడవాళ్లు కూడా ఘోరంగా దొంగతనాలు చేస్తున్నారండీ !"

"అక్కడెక్కడో పోలీసు ఉన్నాడు... పిలవండి! స్టేషన్లో అయితే సరిగ్గా సమాధానం చెబుతుంది.' ఎవరివో సలహాలు, వ్యాఖ్యానాలు పరంపరగా వినబడుతున్నాయి.

రాజారావు ఆ యువకుడి రెండు చేతులూ పట్టుకున్నాడు ! "సార్ ! ఏదో పెద్దావిడ... తప్పో ఒప్పో...! ఎందుకు జరిగిందో...? ఎలా జరిగిందో...? మీ పర్సు పోలేదు కదా ! మీరామెను కొట్టారు... శిక్ష అమలు జరిగిపోయింది. ఆమెను వదిలేయండి ! మీరింక సినిమాకు వెళ్లిపోండి ! ప్లీజ్ !"

రాజారావు మాటలకు ఆ యువకుడు ఏమనుకున్నాడో...సినిమా గుర్తుకురాగానే చిరుతపులిలా జనాన్ని చీల్చుకుంటూ కౌంటరు వద్దకు దూసుకుపోయాడు. అతనితో బాటు చుట్టూ ఉన్న జనం కూడా టిక్కెట్ల కోసం చెదిరి పోయారు.

సీతమ్మ సిగ్గుతో చితికి పోతున్నట్లుగా అలాగే నిలబడి ఉంది ! రాజారావు ఆమెను నిర్లిప్తంగా నిశ్చేతనగా చూస్తున్నాడు.

థియేటరులో బెల్లు మ్రోగింది ! జనం టిక్కెట్లతో హాలు లోపలికి పరుగులు పెడుతున్నారు... సీతమ్మను కొట్టిన యువకుడూ ఇటువైపో చూపు విసిరి లోపలికి వెళ్లిపోయాడు.

సీతమ్మ అలాగే నిలబడి ఉంది... రాజారావుకు నోట మాటలు రావడం లేదు... మౌనంగా అతను థియేటరు లోపలికి నడవబోయాడు...

"బాబూ !" సీతమ్మ శోకతప్తమైన పిలుపుతో చటుక్కున ఆగిపోయాడు.

"ఏం చెయ్యను బాబూ ! ఇంటికి వెళ్లేసరికి మీ

బాబాయిగారికి జ్వరం ఎక్కువయింది. మాత్రలు కొనడానికి డబ్బుల్లేవు. కనీసం టీ చుక్క ఆయన్నోట్లో పోద్దామన్నా చిల్లరలేదు. ఇరుగు పొరుగునడిగినా పని జరగలేదు. పన్లోకి వెళ్తేగాని శేట్ గుమాస్తా డబ్బులివ్వడు. ఎటూ దారి కనిపించలేదు. నువ్వు పదిరూపాయలు ఇవ్వబోతే వద్దన్నాను. అవసరం ముంచుకొచ్చింది. అభిమానం చంపుకుని అడుక్కోవడానికి తయారయ్యాను..."

సీతమ్మ కళ్ల నుంచి ధారపాతంగా అశ్రు వర్షం... రాజారావు శిలాసదృశ్యంగా నిలబడి చూస్తున్నాడు.

"బాబూ! నేను దొంగను కాదు. దొంగతనం నా నరనరాల్లో లేదు. వాడు నా కొడుకే... పెళ్లయిన మూడేళ్లకే పెళ్లాం మాయలో పడి మమ్మల్ని బయటికి తరిమేశాడు. నీతో చచ్చిపోయాడని చెప్పానే... బతికి ఉండీ చచ్చిపోయిన ఆ మాయదారి కొడుకు వాడే బాబు... కన్న తల్లి తన కళ్లముందే అడుక్కోవడం అవమానం అనిపించిందేమో పరువుతక్కువ అనుకున్నాడేమో... పౌరుషం వచ్చిందేమో... నన్ను జుట్టుపట్టుకుని కొట్టాడు... నాయనా! వాడ్ని కన్నాం... పెంచి, పెద్దచేసి చదువు చెప్పించాం... ఉద్యోగం వచ్చింది... ఉన్న వాళ్ల పిల్లనే ఇష్టపడి పెళ్లి చేసుకున్నాడు... ఉన్న ఊళ్లోనే ఒక మూల పాడుబడ్డ గదిలో అనాథల్లా పడున్న మమ్మల్ని నెలకోసారన్నా కనీసం చూడటానికి రాడు... రోడ్డుమీద కనిపించినా పదిపైసలు చేతిలో పెట్టడు... కన్నవాళ్లకో ముద్ద పెట్టలేని కొడుక్కి... వాళ్లు అడుక్కుంటే మాత్రం కొట్టే హక్కు ఉంటుందా బాబూ...? ఇదెక్కడి న్యాయం తండ్రీ...? వాడు నా కొడుకా...? క్రూరమృగమా...? చెప్పు నాయనా ! చెప్పు..?"

సీతమ్మ భోరుమని ఏడుస్తోంది...!

రాజారావు, అతని మనసు నీరుకారిపోయి ఒకవేదనామయ ప్రవాహంలో కొట్టుకుపోతున్నాడు. మానవత్వం శూన్యమవుతూన్న మానవ సంబంధాల వ్యవస్థలో... మనిషి మృగంగా మారుతూన్న వైనాన్ని జీర్ణించుకోలేక పోతున్నాడు...

ఒకనాడు... ఆటవిక యుగంలో... అజ్ఞానపు చీకట్లో... ఆకలి కోసం, అస్థిత్వం కోసం, మనిషి మృగంగా మసలేవాడు. అంచెలంచెలుగా నాగరిక మానవుడిగా పరిణామం చెంది... అన్ని రంగాల్లోనూ ఆకాశమంత ఎత్తుకు ఎదిగిపోయి... తన అంతరంగాన్ని మాత్రం అథఃపాతాళానికి అణగ దొక్కేసుకుంటున్నాడా...? 'మనిషి మృగం'గా మళ్లీ పాతరాతి యుగానికి పరుగుతీస్తున్నాడా...? జన్మనిచ్చిన తల్లినీ తండ్రినీ జవసత్వాలుడిగిన దశలో బయటికి తరిమేయడం ఏ నాగరికతకు ఫలశ్రుతి...? మనిషిమనుగడకు అర్థం, పరమార్థం- స్వార్థం... ఒక్కటే అయితే... మనిషికీ, మృగానికీ తేడా ఆకారం ఒక్కటే...!

కానీ... కొడుకు కొట్టిన అన్ని దెబ్బల్ని మౌనంగా భరించిన సీతమ్మ... వాడు నా కొడుకే అని, అందరిలోనూ ఎందుకు చెప్పలేకపోయింది...? ఎదురు తిరిగి కొడుకు చెంపమీద ఎందుకు కొట్టలేకపోయింది...? ఎందుకనీ...? ఎందుకనీ...?

రాజారావు చేతిలో ఉన్న సినిమా టిక్కెట్టు చింపి ముక్కలు చేశాడు...

"పదమ్మా! మీ ఇంటికి వెళ్దాం! బాబాయిగారికి ఎలా ఉందో చూద్దాం !" సీతమ్మ చేయి పట్టుకున్నాడు. ఆమె చేయి వణుకుతోంది... శరీరం వణుకుతోంది... అయినా ఆ తల్లి కళ్ళల్లో వెలుగు... అనంతకోటి దీపాల వెలుగు...

నిలువెల్లా నిండైన మానవతా, మమతాను రాగాలతో స్పదింస్తూ ఆమెకు నీడగా నడుస్తూ రాజారావు...!

సినిమా థియేటరులో - ఓ తల్లికథలో మృగ వినోదాన్ని అనుభవిస్తూ... ఆనందిస్తూ సీతమ్మ కొడుకు...!

ఈనాడు ఆదివారం అనుబంధం
10-7-1994